పోలీస్ బ్యాడ్మింటన్‌లో ఏసీపీకి కాంస్య పతకం


ఏసీపీ కాసిరెడ్డిని సన్మానిస్తున్న సీపీ తరుణ్‌జోషి

హైదరాబాద్ సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో మెన్స్ సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన వనస్థలిపురం ఏసీపీ పి.కాసిరెడ్డిని సీపీ తరుణ్‌జోషి కమిషనరేట్‌లో అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని, అందుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు: జెడ్సీ


నోడల్ అధికారులతో మాట్లాడుతున్న జెడ్సీ

కూకట్‌పల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ నోడల్ అధికారులను ఆదేశించారు. మూసాపేటలోని జోనల్ కార్యాలయంలో ఆమె నోడల్, సెక్టార్ అధికారులతో శనివారం సమావేశమయ్యారు. ఫ్రీ పోలింగ్ నిర్వహణకు చేపట్టాల్సిన అంశాలపై చర్చించా రు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.

● మూసాపేటలోని జోనల్ కార్యాలయంలో ఓటరు నమోదుపై సిబ్బందికి అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన వారికి ఆన్‌లైన్ ద్వారా ఏప్రిల్ 15వతేదీ వరకు అవకాశం కల్పించామని అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఇంద్రసేన, లలితదేవి, మునిస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోదీని మూడోసారి గెలిపించాలి: ఈటల


అల్లాపూర్‌లో మాట్లాడుతున్న రాజేందర్

అల్లాపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్ కాలనీలో బీజేపీ ఆత్మీయసమ్మేళనాన్ని ఆ పార్టీ మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి పురిగొల్ల శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రి, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌తో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఈటల, బీజేపీకి వచ్చే ఎన్నికల్లో 400పై చిలుకు స్థానాలు దక్కనున్నాయని, నార్లపురం శ్రీనివాస్‌తో పాటు సుమారు 50 మంది రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మూసాపేట్ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్, మహిళా నాయకురాలు పులిగొల్ల శ్రీలక్ష్మి, కాలనీవాసులు అధికంగా పాల్గొన్నారు.

కిందికుంట పార్కులో సమస్యల పరిష్కారానికి కృషి


వాకర్స్‌తో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

హైదర్‌నగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ కిందికుంటపార్కులో వాకర్స్‌తో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు వాకింగ్ చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిందికుంట పార్కులో వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

ఫారం-12డిని సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది 85 ఏళ్లు పైబడిన, అర్హులైన దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు వేసే హక్కు కోసం అందిచాల్సిన ఫారం-12డి పంపిణీ చేశారు. నియోజకవర్గ ఓటరు జాబితా ప్రకారం వారి ఇళ్లకు వెళ్లి బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఫారం-12డిని అందజేస్తున్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నియోజకవర్గ ఏఆర్వో పులి సైదులు, ఎన్నికల అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు.


నూతన కమిటీ సభ్యులు

రిటైర్డ్ ఎంప్లాయీస్, ఉపాధ్యాయుల కమిటీ ఎన్నిక

పేట్‌బషీరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రిటైర్డ్ ఎంప్లాయీస్, ఉపాధ్యాయులు కమిటీని శనివారం ఎన్నుకున్నారు. జీడిమెట్లలోని సాయి సంకల్ప కాలనీలో సంఘం ఎన్నికల పరిశీలకులు సాంస్కృతిక కార్యదర్శి సీహెచ్ బాలచంద్రం అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జగన్నాథ బాలకృష్ణారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడిగా సాయిబాబారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అంజయ్యగౌడ్, అదనపు కార్యదర్శిగా వెంకటాచార్యులు, ఆర్థిక కార్యదర్శిగా దశరథ రామాశర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మల్లయ్య, రఘుపతి, సలహాదారులుగా అంజయ్య, రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు.


ఉమెన్స్‌డే వేడుకల్లో కార్పొరేటర్ రావుల శేషగిరి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గాజులరామారం, మార్చి23(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే అభివృద్ధి జరుగుతుందని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజులరామారంలోని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం ఉమెన్స్ డే ఘనంగా నిర్వహించారు. అనంతరం జీహెచ్ఎంసీ సిబ్బందికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్లాస్టిక్ నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేయాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కే.సత్యనారాయణ అన్నారు. శనివారం కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు, బ్యాగులు వినియోగించడం నిషేధమన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఈ నిబంధన పాటించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించి తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లు వినియోగించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మేనేజర్ నర్సింహులు, ఈఏ సాత్విక్, అంజయ్య, మధు పాల్గొన్నారు.

మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఫణికుమార్



జై భారత్ నేషనల్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా కేపీహెచ్‌బీ ఫేజ్-6 నివాసి జువ్వా ఫణికుమార్ నియమితులయ్యారు. ఆ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నట్టు శనివారం తెలిపారు.

- కేపీహెచ్‌బీకాలనీ, ఆంధ్రజ్యోతి

ఆస్తిపన్ను వసూళ్లలో శేరిలింగంపల్లికి ప్రథమ స్థానం



శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం

గచ్చిబౌలి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను వసూళ్లలో జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతీఏడు శేరిలింగంపల్లి సర్కిల్ అత్యధికంగా వసూలు చేసి అగ్రస్థానంలో నిలుస్తుంది. మరో పది రోజుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో పై అధికారులు నిర్దేశించిన లక్ష్యం చేరేందుకు సర్కిల్ అధికారులు ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రస్తుత సంవత్సరం రూ.284.96 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటికే శేరిలింగంపల్లి సర్కిల్ సిబ్బంది రూ.266.44 కోట్లు వసూళ్లు చేయడం విశేషం. ఈనెల 31లోగా ఆస్తిపన్ను చెల్లిస్తే వడ్డీలో 90 శాతం రాయితీ వస్తుందని ఈ విషయం బకాయిదారులకు వస్తుందని, పన్నుల వసూళ్ల అధికారులు చేస్తున్నారు. కొండాపూర్, మాదాపూర్, భారతినగర్ డివిజన్ భెల్‌ఎంఐజీ కాలనీలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కిందిస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహిస్తు పూర్తిస్థాయిలో పన్ను వసూలు చేయడంలో దృష్టి సారించారు.

శేరిలింగంపల్లిలో అసెస్‌మెంట్ వివరాలు

- ఆస్తిపన్ను వసూళ్లకు శేరిలింగంపల్లి పరిధిలో ప్రత్యేక టీంలు ఏర్పాటు.
- సర్కిల్ పరిధిలో నాన్‌రెసిడెన్షియల్ భవనాలు 17,166 ఉండగా రూ.117.29 కోట్లు వసూలు అయింది.
- రెసిడెన్షియల్ అసెస్‌మెంట్‌లు 99,195 ఉండగా వీటి ద్వారా ఇప్పటికే రూ.98.18 కోట్లు వసూలు చేశారు.
- గతేడాది మార్చి 31 వరకు 299.36 కోట్ల రూపాయలు వసూళ్లు చెయ్యగా ఇప్పటికే ఆ టార్గెట్‌కు 7 కోట్లకు పైగా వసూలు చేశారు.
- సర్కిల్ పరిధిలో బిల్‌కలెక్టర్లతో పాటు మీ-సేవ కేంద్రాలు, సర్కిల్ కార్యాలయంలోని సిటీ సర్వీస్ సెంటర్లలో కూడా ఆస్తిపన్ను చెల్లించవచ్చు.

ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను దారులు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. దీని కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. గత ఆర్థక సంవత్సరంలో పూర్తిగా బకాయిలు వసూలు చేశాం. చెల్లింపు ఈ నెలాఖరు వరకు చెల్లిస్తే 90శాతం వడ్డీ రాయితీ ఉంది.

- రజనీకాంత్‌రెడ్డి, మున్సిపల్ ఉపకమిషనర్


కళాకారుల నృత్యప్రదర్శన

నృత్యోపచార భరతనాట్య ప్రదర్శన

మాదాపూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించిన అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా సంగీత, నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నృత్యశిక్షణాలయ విద్యార్థులు బ్రహ్మ మొక్కటే, మధుర..మధుర, కదన కుతూలం తదితర అంశాలపై అభినయం చూపరులను మంత్రముగ్ధులను చేసింది.

ప్రధాని ఆధ్వర్యంలో భారత్ ఉజ్వల అభివృద్ధి

చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చందానగర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వృద్ధుల నుంచి యువకులు, చిన్నారుల హృదయాలను దోచుకున్న గొప్పనాయకుడు ప్రధాని మోదీ అని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ డిజన్ నాయకులు, కార్యకర్తలు, బూత్‌స్థాయి నాయకుల సమావేశం చందానగర్‌లో శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బూత్‌స్థాయి నిర్మాణం పటిష్టంగా జరిగితేనే గెలుపు తథ్యమని, నాయకులంతా బూత్‌కమిటీల నియామకపై దృష్టి పెట్టాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని ప్రధానిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, నాయకులు శ్రీనివాస్, రాఘవేందర్‌రావు, మణిభూషణ్, డాక్టర్ నరేష్, నరేందర్‌రెడ్డి, సురభి రవీందర్‌రావు నాగేశ్వర్‌గౌడ్, హన్మంత్‌నాయక్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, అల్లూరి రామరాజు, నవతారెడ్డి, రామిరెడ్డి, కృష్ణ, మాణిక్‌రావు, శ్రీధర్, మాధవచారి, ఆంజనేయులు ఉన్నారు.

ట్యాంకర్లకు రూ.2 వేలు

(5వ పేజీ తరువాయి)

గృహావసరాలకు రూ.500కు, వాణిజ్య అవసరాలకు రూ.850కు విక్రయిస్తున్నది. ప్రైవేట్ ట్యాంకర్ల దోపిడీని భరించలేని మాదాపూర్ ప్రాంతంలోని నివాసితులు కొత్త ఉపాయం పన్నారు. స్నేహితులు, పరిచయస్తులు, బంధువుల ఇళ్ల పేరిట వాటర్ ట్యాంకర్‌ను బుక్ చేసుకుని నీటిని తెప్పించుకుంటున్నారు.

25 ప్రాంతాల్లో డిమాండ్

గ్రేటర్ పరిధిలోని 25 ప్రాంతాల్లో పెద్దఎత్తున ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ప్రధానంగా మాదాపూర్, షేక్‌పేట, ఎర్రగడ్డ, మియాపూర్, హఫీజ్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎస్ఆర్‌నగర్, మణికొండ, మూసాపేట, కేపీహెచ్‌బీ, భరత్‌నగర్, గచ్చిబౌలి, ఎల్లారెడ్డిగూడ, రాయదుర్గం, కొండాపూర్ తదితర ప్రాంతాల నుంచి ట్యాంకర్‌లకు బుకింగ్‌లు ఎక్కువగా అవుతున్నాయి. జనవరి ఒకటి నుంచి 1,300 ట్యాంకర్లు బుకింగ్ కాగా, మార్చి 22న 4,079 ట్యాంకర్లు బుక్ అయ్యాయి. రెండు నెలల వ్యవధిలోనే మూడింతల డిమాండ్ పెరగడం నీటికొరత, అవసరానికి అద్దం పడుతున్నది. కాగా బస్తీలతో పాటు ఆలయాలు, మసీదులు వాటికి జనవరి ఒకటో తేదీన 350 ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటిని అందిస్తే.. ప్రస్తుతం రోజుకు 637 ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. మున్ముందు మరింత అధికంగా ట్యాంకర్ల బుకింగ్ పెరిగే అవకాశాలున్నాయి.

ఆ ఏడు డివిజన్లలో 84 శాతం డిమాండ్

వాటర్‌బోర్డు పరిధిలో దాదాపు 580కి పైగా ట్యాంకర్లున్నాయి. వీటి ద్వారా ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటలవరకు.. రెండు షిఫ్టుల్లో నీటిని సరఫరా చేస్తున్నారు. వాటర్‌బోర్డు పరిధిలో మొత్తం 24 డివిజన్లు ఉండగా, ఆరు డివిజన్లలోనే ట్యాంకర్ డిమాండ్ 84 శాతం మేరకు ఉన్నది. అందులో.. 35 శాతం హఫీజ్‌పేట, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి(డివిజన్-15)లలో, 22 శాతం ఎస్ఆర్‌నగర్ (డివిజన్-6)లో, 14 శాతం కూకట్‌పల్లి (డివిజన్-9)లో, 7 శాతం మణికొండ(డివిజన్-18)లో, ఆరుశాతం నిజాంపేట్ (డివిజన్-23)లో డిమాండ్ ఏర్పడుతున్నది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా నీటిని సరఫరా చేయడానికి అదనంగా మరిన్ని ట్యాంకర్లను సమకూర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పగటి సమయంలోనూ ఆయా ప్రాంతాల్లో వాహనాల రద్దీ కారణంగా డెలివరీ ఆలస్యమవుతోంది. దీంతో ట్రిప్పుల సం ఖ్య తగ్గుముఖం పడుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో వీధుల్లో ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నది. దీంతో రాత్రి సమయాల్లో అదనంగా మరో షిఫ్ట్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మామూళ్ల మత్తులో..

మాదాపూర్, గుట్టలబేగంపేట ప్రాంతాల్లోని సున్నంచెరువు పరిసర ప్రాంతాల్లో కొందరు పెద్దఎత్తున బోర్లు వేసి నీటిని తోడుతున్నారు. రోజుకు వందలాది ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌ను సామర్థ్యాన్ని బట్టి రూ.1500 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ శాఖల నిర్లక్ష్యం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని జనం వాపోతున్నారు.


మృతిచెందిన గణేశ్

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు యువకుడి మృతి

జీడిమెట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓయువకుడు దుర్మరణం చెందాడు. వెనుక వచ్చిన నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై వెనుక కూర్చున యువకుడు బస్సు కింద నలిగిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి తృటిలో స్వల్పగాయాలతో ప్రాణాపాయ స్థితినుంచి తప్పించుకున్నాడు. వీరిద్దరు అన్నదమ్ములు. వీరిద్దరు కూడా ఎలక్ట్రిషియన్ పనులు చేస్తుంటారు. వివరాల్లోకి వెలితే.. సంగారెడ్డి జిల్లా, హత్నూర్ మండలం, మంగళూరు గ్రామానికి చెందిన మల్లయ్య కుమారుడు కె.గణేశ్(24) అతడి సోదరుడు ఇద్దరు కలిసి శనివారం ఉదయం బైక్‌పై నర్సాపూర్ నుంచి బాలానగర్ వస్తున్నారు. బాలానగర్‌లో ఓ మోటర్ రిపేర్ కోసం వస్తుండగా జీడిమెట్ల హమాలీ అడ్డా వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తు న్న బైక్‌ను జీడిమెట్ల డిపోకు చెందిన బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్ వెనుక కూర్చున్న గణేశ్ బస్సుకింద పడ్డాడు. దీంతో బస్సు అతడిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకుల అరెస్ట్

జీడిమెట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు పాతనేరస్తులను జగద్గిరిగుట్ట పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి 10 తులాల బంగారు నగలు, 8 తులాల వెండి, 89,500ల నగదు మొత్తం 3.5 లక్షల విలువ చేస్తే సొత్తు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారంకాలనీ సుందర్‌నగర్‌కు చెందిన దేవంగుల రవి అలియాస్ గజా(22), సూరారంకాలనీ వడ్డెరబస్తీకి చెందిన దేవంగుల నర్సింహ్మ అలియాస్ బబ్బులు (20)లు అన్నదమ్ములు. వీరు గతంలో పలు దొంగతనాలు, హత్యకేసుల్లో నిందితులుగా ఉన్నారు. చెడు అలవాటులకు బానిసైన చోరీలు చేస్తున్నారు. పక్కా ప్లాన్‌తో రాత్రి తాళాలు వేసిన ఇళ్లను టార్గట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈనెల 21వతేదీన అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిద్దరిని జగద్గిరిగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్టు అంగీకరించారు. వీరి నుంచి నగదు, బంగారు, వెండినగలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఫోన్ చూడొద్దని తండ్రి మందలించడంతో బాలిక ఆత్మహత్య

జీడిమెట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ ఎక్కువగా చూఊద్దని తండ్రి మందలించడంతో ఓమైనర్ బాలిక తీవ్రమనస్తాపంతో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎల్లమ్మబండ ప్రాంతంలోని దత్తాత్రేయకాలనీకి చెందిన మహ్మద్ అంజాద్ కుమార్తె అప్సా(14) 9వ తరగతి చదువుతుంది. బాలిక నిత్యం సెల్‌ఫోన్ వినియోగిస్తుండటంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేద ముస్లింలకు రంజాన్ తోఫాలు అందించాలి


నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్‌తో డివిజన్ నాయకులు

ఓల్డుబోయిన పల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ముస్లింలు అతి పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేయాలని కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఓల్డుబోయినపల్లి డివిజన్ బీఆర్ఎస్ కార్యాలయంలో మైనారిటీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రసంగించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రంజాన్ మాసం మొదలవ్వగానే పేద ముస్లింలకు రంజాన్ తోఫాలను అందించి ఆదరించిందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో వార్డు మెంబర్ ఖదీర్, నాయకులు యం.డి అర్షద్, యం.డి.ఖాజ, మిరాజ్, ముస్తఫా, అబ్దుల్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

చెరువు భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


గంగారం పెద్దచెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజుల, అధికారులు

చందానగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చందానగర్ గంగారం పెద్దచెరువును ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారులు, కార్పొరేటర్ మంజులరెడ్డితో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగారం చెరువులో మూడు ఎకరాల వరకు అక్రమార్కులు మట్టితో పూడ్చి కబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు. చెరువును రక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో 65 వరకు నిర్మాణాలు గుర్తించామని, మరో 10 అక్రమ నిర్మాణాలకు దొడ్డిదారిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇచ్చినట్టు వివరించారు. ప్రస్తుతం ఒకటి నిర్మాణ దశలో ఉందని, అక్రమ కట్టడాలు జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాలకు దొడ్డిదారిలో అనుమతులు ఇచ్చిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. గంగారం చెరువును త్వరలోనే సుందరీకరణ పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో చందానగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, నాయకులు నరేందర్, వరలక్ష్మి, అవినాష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లకు నివాళి

మియాపూర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ ఎంఏనగర్‌లోని ఎంసీపీఐ(యూ) కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంసీపీఐ(యూ) చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి వనం సుధాకర్ హాజరై నాయకులతో కలిసి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం, సమానత్వం కోసం అతిపిన్న వయస్సులో ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల ఆశయ స్ఫూర్తితో మతోన్మాదం, ఫాసిజం విధానాలతో పాలిస్తున్న బీజేపీ నుంచి దేశాన్ని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్, ఎండి సుల్తానా, తాండ్ర కళావతి, సుకన్య, భాగ్యమ్మ, దానయ్య, కీర్తి, శివాని, రాజు తదితరులు పాల్గొన్నారు.


భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు


ప్రసంగిస్తున్న డా. రఘునాథ్‌స్వామి

క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి

బాలానగర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): క్షయ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ టి.రఘునాథ్‌స్వామి సూచించారు. మార్చి 24 క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాధికారులు, బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి హెచ్ఎంటీహిల్స్‌లో క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించి అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా క్షయతో రోజుకు 3,500 మరణాలు సంభవిస్తున్నాయన్నారు. క్షయని సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం క్షయను అంతమొందించేందుకు కృషి చేస్తామని వైద్యులు, వైద్య సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి జోన్ జిల్లా వైద్యాధికారి డా.రాంకుమార్, డిస్ట్రిక్ డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ (కీసర డివిజన్) డా.నారాయణరావు, డిస్ట్రిక్ డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ (మల్కాజిగిరి డివిజన్)డా.ఆనంద్, టీబీ ప్రోగ్రాం జిల్లా ఆఫీసర్ డా. బి.సంధ్య, జిల్లా ఇమ్యునేజేషన్ అధికారి డా.సరస్వతి, టీడీ మినీ హబ్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ పద్మావతి, బాలానగర్ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మమత, ఎల్లమ్మబండ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మమనుప్పన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

సంక్షిప్త వార్తలు

రేణుకాఎల్లమ్మ అష్టమ వార్షికోత్సవం

పేట్‌బషీరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీ హౌజింగ్ బోర్డు కాలనీ రేణుకాఎల్లమ్మ ఆలయంలో అష్టమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలు ఈనెల 25 నుంచి 31 వరకు జరుగుతాయని తెలిపారు.

'లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యం '

నిజాంపేట్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రాగిడి రజనీ, వారి కుమార్తె, సోదరి శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ ప్రణయధన్‌రాజ్ యాదవ్‌ని ఆమె నివాసంలో కలిశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకోవాలని కార్పొరేషన్ ప్రజలకు పిలుపునిచ్చారు.

సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలి

జీడిమెట్ల: మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డిని అత్యంత మెజార్టీతో గెలిపించాలని రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కెఎం.ప్రతాప్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కేపీ.విశాల్‌గౌడ్, మహిళలు పాల్గొన్నారు.

లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించుకుంటాం

బాలానగర్: కాంగ్రెస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడు కే.రమేష్, నాయకులు నరేందర్‌ముదిరాజ్ తదితరులు సునీతమహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

బాలానగర్: పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాలలో ఎదగాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి మహిళలకు సూచించారు. బాలానగర్ డివిజన్ పరిధి సాయినగర్‌లో మహిళా నాయకురాలు నిర్మల ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకల్లో కేకు కట్‌చేసి మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

చెరువును కాపాడండి

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ సర్వేనెంబరు 324లో ఉన్న చెరువు బీఆర్ఎస్ నాయకులు కబ్జాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి చెరువును సందర్శించి పరిశీలించారు. వెంటనే రెవెన్యూ, మున్సిపల్ అధికారు లకు ఫోన్ చేసి మాట్లాడిన హన్మంత్‌రెడ్డి చెరువును రక్షించాలని, కబ్జాదారులు ఎవరో గుర్తించి, కేసులు నమోదు చెయ్యాలని అధికారులకు సూచించారు.

'సైబర్ క్రైమ్'పై అవగాహన కార్యక్రమం

హైదరాబాద్ సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మెడికవర్ ఆస్పత్రిలో 'సైబర్ క్రైమ్'పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం మెడికవర్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా ముఖ్యఅతిథిగా విచ్చేసి సైబర్ నేరగాళ్లు విజృంభిస్తున్న నవాళ్లపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. విశిష్ట ప్యానెల్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, న్యాయ నిపుణులు, సైబర్ సెక్యూరిటీ నిపుణులతో పాటు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కేపీఎం ప్రసాద్, శబరినాథ్, శ్రుతి అయ్యర్ తదితరులు పాల్గొన్నారు. డిజిటల్ యుగంలో వ్యక్తిగత, సంస్థాగత డేటాను రక్షించాల్సిన ఆవశ్యకతను జస్టిస్ నందా వివరించారు. సైబర్ క్రైమ్‌ను ఎదుర్కోవడంలో చురుకైన చర్యల కీలక పాత్రను వివరించారు.